క్లుప్తంగా

పాపం పసికూనలు

● అగ్నికి ఆహుతైన గొర్రె పిల్లలు



కమలాపూర్ : అప్పుడే తల్లిపాలు తాగి చెంగుచెంగున ఎగిరిన గొర్రెపిల్లలు హఠాత్తుగా సంభవించిన అగ్నిప్రమాదానికి ఆహుతి అయ్యాయి. మండలంలోని భీంపల్లి గ్రామ శివారులో గల పొలాల్లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో పది గొర్రె పిల్లలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఓ రైతు పొలంలో గొర్ల కాపరులు గొర్రెల మంద పెట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు వీచడంతో పొలం పైనుంచి ఉన్న విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తాకింది. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మిరుగులు పడి పంట పొలంలోని వరి కొయ్య కాళ్లు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో గొర్రెల మంద చిక్కుకుని మంటల ధాటికి పది గొర్రె పిల్లలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో గొర్రెల మృతి



ధర్మసాగర్ : వీధికుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని ముప్పారం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుడు గడ్డం యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. రోజుమాదిరిగానే సోమవారం సాయంత్రం గొర్రెలను షెడ్డులో కట్టేశాడు. మంగళవారం తెల్లవారుజామున షెడ్డులోకి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేయగా 10 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు. మరో 5 గొర్రెలు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. మృతి చెందిన గొర్రెల విలువ 80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని యాదగిరి కోరాడు.

పోస్టల్‌బ్యాలెట్‌కు బారులు



పరకాల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల నియోజకవర్గంలో 772 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవగా 225 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్డీఓ నారయణ తెలిపారు. పోలీస్ బందోబస్తు నడుమ పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యం



నర్సంపేట రూరల్ : కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోత యువత కోసం ఉద్యగ నియామకాలు చేపట్టడానికి తక్షణమే ప్రాధాన్యత ఇస్తామని ఎన్ఎస్‌యూఐ నేషనల్ డెలిగేట్ ఎడమ పవన్, జిల్లా ఇన్‌చార్జ్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం 'మహబత్ కి దుకాన్' కార్యక్రమ వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి పవన్, శివకుమార్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ నిరుద్యోగ యువతను పూర్తిగా విస్మరించి పదేళ్లపాటు మోసపూరిత పాలన సాగించిందని విమర్శించారు. కాంగ్రెస్ యువజన సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బేతి భరత్, కటారి ఉత్తం, మంద శివ, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన పోరిక బలరాం నాయక్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని 24వ వార్డు కమిటీ అధ్యక్షుడు కోలా చరణ్, పార్టీ పట్టణ కమిటీ అధికార ప్రతినిధి గుంటి వీరప్రకాశ్ కోరారు. పట్టణంలోని 24వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోసపూరిత హామీలతో ప్రజలను వంచించాయని తెలిపారు. అందుకే రాష్ట్రంలోని ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. ప్రజాకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ అన్ని హామీలనూ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

ఉరుములు, మెరుపులు, పిడుగులు

● వివిధ మండలాల్లో మోస్తరు వర్షం
● తడిసిన ధాన్యం.. ఇళ్లలోకి వర్షపు నీరు
● ఈదురుగాలుల బీభత్సం
● తెగిన విద్యుత్ లైన్లు



కమలాపూర్ : వరదకు కొట్టుకుపోతున్న ధాన్యం

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు రెండుగంటల పాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. వివిధ గ్రామాల్లో దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు కల్లాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్న తడువకుండా రైతులు టార్పాలిన్లు కప్పి ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు. అదే విధంగా మండల కేంద్రంలో సైడ్ డ్రేయినేజీ లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తు పలువురి ఇళ్లలోకి చేరింది.

తడిసిన ధాన్యం..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. అకాల వర్షానికి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసి వరదలో కొట్టుకుపోయింది. బస్తాల్లో నింపి తూకాలు వేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఈదురు గాలుల ధాటికి గూడూరు–అంబాల గ్రామాల మధ్యలో చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చేరుకుని చెట్లను డోజర్ సాయంతో తొలగింపజేశారు. మండల కేంద్రంలో ఓ చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడడంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పరకాలలో..

పరకాల : మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కూరగాయల మార్కెట్ రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయిగా వాహనదారులు,ఇబ్బందులు పడ్డారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. అలాగే ఈదురుగాలులకు పలు చోట్ల చెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి. 33 కేవీ విద్యుత్ లైన్‌లో లోపం ఏర్పడగా మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా చోట్ల సెల్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఐనవోలు : కొండపర్తి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



పరకాల : నిలిచిన వర్షపునీరు



శాయంపేటలో..



శాయంపేట : ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

బీఆర్ఎస్, బీజేపీతో భవిష్యత్ అంధకారం

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

నడికూడ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపికి ఓటు వేస్తే భవిష్యత్ అంధకారమేనని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాయపర్తి, పులిగిల్ల, నర్సక్కపల్లి, చర్లపల్లి, వరికోల్, నార్లపూర్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. పది సంవత్సరాలుగా రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూ పాలించాయని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యని, ఇతర పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



కమలాపూర్ : మాట్లాడుతున్న రమేశ్



దామెర : ప్రచారం నిర్వహిస్తున్న శ్రీరాంరెడ్డి

కమలాపూర్ : కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కోకన్వీనర్ మాట్ల రమేశ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుతో మాట్లాడారు. కొన్ని పత్రికలు, యూట్యూబ్ చానళ్ల, కొందరు రాజకీయ పార్టీల నాయకులు ఉద్దేశపూర్వకంగా కమలాపూర్ మండలంలో బీజేపీ వర్గాలుగా చీలిపోయిందని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీజేపీలో విభేదాలు లేవని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ కరీంనగర్‌లో బండి సంజయ్, ప్రధానిమంత్రిగా నరేంద్రమోదీని గెలిపించాలని కష్టపడి పనిచేస్తున్నట్లు తెలిపారు.

దామెర : కేంద్రంలో మూడోసారి ప్రధానమంత్రిగా మోదీని గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల బొమ్మల చెరువులో మంగళవారం ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బూత్ అధ్యక్షులు నవీన్, అనీల్ , నాయకులు చిరంజీవి, సుధాకర్, సాంబరాజు, రోహిత్, అరుణ్, ప్రశాంత్, వెంకటేశ్ ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించాలి



పరకాల : కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న ధర్మారెడ్డి



దామెర : కూలీలతో మాట్లాడుతున్న కృపాకర్‌రెడ్డి

పరకాల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపి ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం లక్ష్మీపురం, వెల్లంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

దామెర : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రం సమీపంలోని వీరాయి చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, నాయకులు బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, గడ్డం సదానందం, సోనబోయిన రాజు, కిశోర్, పుట్ట భిక్షపతి, మేరుగు సంపత్ పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

పరకాల : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తించిన మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగ పద్మజ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై ఆమె మంగళవారం స్థానిక రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నాగపద్మజ

నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

కమలాపూర్ : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను ఈనెల 10 లోపు పూర్తిచేయాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. మండల కేంద్రంలోని టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో గల 21 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో తాగునీటి వసతి, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పాఠశాలల మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆయా పనులు గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, పాఠశాలల హెచ్ఎంల పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.



కమలాపూర్ : పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య

నర్సంపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య కోరారు. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన బలరాంనాయక్‌ను గెలిపించాలని ఆయన సూచించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో 'బీజేపీ బందీఖాన నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం' బుక్‌లెట్‌ను రంగయ్య మంగళవారం విడుదల చేసి మాట్లాడారు. బీజేపీ గడచిన పదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలనూ తుంగలో తొక్కి సంపన్నులకు లబ్ధి చేకూర్చేలా తప్పుడు విధానాలు అవలంభించిందని చెప్పారు. రైతులకు, కార్మికులకు, అన్ని వర్గాల ప్రజలకూ తీరని అన్యాయం చేసి బీజేపీని చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన బీజేపీకి తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని స్పష్టం చశారు. కులాలు, మతాల పేరుతో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ మనువాదాన్ని తీసుకొచ్చేలా వ్యవహరిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. బీజేపీని ఓడించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, భూక్య సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, ముంజాల సాయిలు, హన్మకొండ శ్రీధర్, అనంతగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

● నిర్మాణ దశలోనే మూలుగుతున్న వైనం
● పట్టించుకోని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, చిన్నారులు



దామెరలో అంగన్‌వాడీ కేంద్రానికి అడ్డంగా ఏర్పాటుచేసిన రాళ్లు


దామెర : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ, వారిని ఆరోగ్యంగా తీర్చిదిద్దాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టులాడుతున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార సరఫరాలో భాగంగా పప్పు దినుసులు, నూనే, స్నాక్స్, కోడిగుడ్లతో పాటు బాలామృతం ప్యాకెట్లను అందిస్తున్నారు.

అద్దె భవనాల్లోనే..

మండలంలో 14 గ్రామాల్లో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 18 కేంద్రాలకు పక్కా భవనాలు ఉండగా మిగిలిన 19 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లోని శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్న పిల్లలను ఆకట్టుకునే విధంగా ఆట వస్తువులతో పాటు విశాలమైన మైదానం కలిగి ఉండాల్సి ఉన్నా అలాంటి సదుపాయాలు లేవని పలువురు విస్మయం చెందుతున్నారు. కాగా అంగన్‌వాడీ సెంటర్లలో ఎలాంటి మౌలికవసతులు లేకపోవడంతో చిన్నారుల, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఒకటి, రెండు కేంద్రాల్లో తప్ప మిగిలిన ఏ కేంద్రాల్లో కూడా వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ల్యాదెళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా అందులో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. తక్కళ్లపహాడ్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని వసతులతో కూడిన పక్కా భవనాల నిర్మించడంతో పాటు ఆట వస్తువులను అందించాలని చిన్నారుల తల్లులు, బాలింతలు, గర్భిణులు తదితరులు కోరుతున్నారు.

అడ్డుగా గోడ నిర్మాణం..

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించేందుకు ఓ దాత భూమిని దానం చేయగా అందులో భవనాలు నిర్మించారు. అయితే ప్రస్తుతం అతని కుమారుడు ఆ స్థలంలో నిర్మించిన కార్యాలయానికి ఎవరూ రాకూడదంటూ రాళ్ల గోడను అడ్డుగా నిర్మించాడు. దీంతో అక్కికి వెళ్లే మార్గంలేక గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చేసేదిలేక ఈ కేంద్రాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. గోడను తొలగించి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.



ల్యాదెళ్లలో శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



తక్కళ్లపహాడ్‌లో నిర్మాణ దశలో నిలిచిన అంగన్‌వాడీ భవనం

నిర్మాణం పూర్తి చేయాలి



తక్కళ్లపహాడ్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం పనులు 2016 ప్రారంభించారు. స్లాబ్ పనులు పూర్తి అయిన తరువాత పనులు నిపివేశారు. ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పనులు పూర్తి చేయక పోవడంతో శిథిలావస్థకు చేరేలా ఉంది. అధికారులు చొరవతీసుకొని త్వరగా పూర్తి చేయాలి.

\- గోగ్గూర రాజ్‌కుమార్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

మండలంలో 19 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాల్సి వుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల దష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. పక్కా భవన నిర్మాణాలు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరతాను.

\- జంగం రాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కాంగ్రెస్‌కు గుణపాఠంచెప్పాలి

ఖానాపురం : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితకు ఓటేసి గెలిపించి మోసపూరిత విధానాలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నాయకుడు, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ప్రజలను కోరారు. మండలంలోని ఖానాపురం, తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేడిద కుమార్, మాజీ ఎంపీటీసీ పూలునాయక్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఎన్నికల నిర్వహణలో నిజాయతీ కీలకం

చెన్నారావుపేట : ఎన్నికల నిర్వహణలో నిజాయితీ కీలకమని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో ఓటు హక్కుపై అధ్యక్షురాలు కద్దూరి హైమ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఈశ్వర్ మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయి సిబ్బందిగా వీఓఏలు నిబద్ధతతో పూర్తిస్థాయిలో పని చేసి వయో వృద్ధుల, వికలాంగుల ఓటింగ్ 100 శాతం నమోదయ్యేలా కృషి చేయాలని చెప్పారు. రూట్ మ్యాప్‌తో పికపింగ్, డ్రాపింగ్‌తో గుర్తించిన వయోవృద్ధులు, వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తున్న రవాణా, వీల్ చైర్ సౌకర్యం కల్పిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం నీతినిజాయితీతో విధులు నిర్వహిస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో లక్ష్మీ, సుజాత, స్వరూప, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కట్టయ్య పాల్గొన్నారు.